క్లుప్తంగా

25న డోలాయాత్ర

కురుపాం: మండలంలోని శివ్వన్నపేట జగన్నాథస్వామి ఆలయ ఆవరణలో ఈ నెల 25, 26 తేదీల్లో డోలాయాత్ర నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. రెండు రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఏడు బస్తాల జీడిపప్పు స్వాధీనం



జీడిపప్పు బస్తాలను సీజ్ చేస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: పాలకొండ–విశాఖ, వీరఘట్టం కూడలి (వైఎస్సార్ జంక్షన్) వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద శుక్రవారం రాత్రి వాహన తనిఖీలు చేపట్టారు. శ్రీకాకుళం జిల్లా పలాస నుంచి పార్వతీపురం వైపు వెళ్తున్న బస్సులో ఏడు బస్తాల జీడిపప్పును ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ పట్టుకుంది. జీడిపప్పు బస్తాల తరలింపునకు సంబంధించి ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో వాటిని సీజ్ చేశా రు. కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

2 వేల మందికి వైద్య సేవలు



శిబిరంలో రోగులకు మందులు అందజేస్తున్న సిబ్బంది

గరుగుబిల్లి: మండలంలోని రావుపల్లి మండల పరిషత్ పాఠశాల ఆవరణలో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. హైదరాబాద్‌లోని కేర్ ఆస్పత్రిలో కార్డియాలిజిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ గుల్ల సూర్యప్రకాష్ స్వగ్రామమైన రావుపల్లిలో సీతారామ మందిర పునఃప్రతిష్ఠను పురస్కరించుకొని వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు డా.రామ్మోహనరావు, డా.గుల్ల రామ్‌నరేష్, డా.బీపీఆర్ నాయుడు(నాని) తదితరులు శిబిరంలో పాల్గొని సుమారు 2 వేల మంది రోగులకు వైద్య సేవలందించారు. రోగులకు ఉచితంగా మందులతో పాటు తాగునీరు, మజ్జిగ, పులిహోర ప్యాకెట్లు అందజేశారు.

ఎన్నికల విధుల కేటాయింపులో పారదర్శకత పాటించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయ జేఏసీ నాయకులు

వీరఘట్టం: ఎన్నికల విధులకు ఉపాధ్యాయులను నియమించే సమయంలో ఎలాంటి పైరవీలకు తావులేకుండా పూర్తి పారదర్శకంగా చేపట్టాలని మండల ఉపాధ్యాయ జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ జయప్రకాష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా పీహెచ్‌సీ ఉపాధ్యాయులను, రిటైర్మెంట్ ఆరు నెలల లోపు ఉన్న వారిని ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఉపాధ్యాయుల కేడర్లు ప్రామాణికంగా తీసుకుని విధులు అప్పగించాలని, మహిళా ఉపాధ్యాయులకు పీఓ బాధ్యతల నుంచి ఏపీఓ, ఓపీఓ బాధ్యతలు కేటాయించాలని కోరారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

పార్వతీపురం టౌన్: వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని మండల విద్యాశాఖాధికారి సామల సింహాచలం అన్నారు. నర్సిపురంలోని మూడు ఎంపీపీ పాఠశాలలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టీచర్ల డైరీలు, లెస్సన్ ప్లాన్లు, వర్క్‌బుక్స్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సిలబస్ పూర్తి చేయాలన్నారు. ఆంగ్ల పాఠ్యాంశాలను బాగా చదివిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు శారద, గుడ్ల అమ్మాజీ, సీఆర్ఎంటీ శిరీష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సారా స్థావరాలపై పోలీసుల దాడి

పాచిపెంట: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు సమీపంలో ఒడిశా ప్రాంతంలో సారా స్థావరాలపై ఇరు రాష్ట్రాల పోలీసులు సంయుక్తంగా శుక్రవారం దాడులు చేశారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు రూరల్ సీఐ బాలకృష్ణ, పాచిపెంట ఎస్సై నారాయణరావు, ఒడిశా పోలీసులతో కలిసి లావిడి, కాందిలి, ఒలిసి, పులిగుంట, తదితర ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. 140 లీటర్ల సారా, 4200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్సై నారాయణరావు తెలిపారు.

దేవనాపురంలో ప్రగతి పరుగులు

- మౌలిక సదుపాయాల కల్పనతో పెరిగిన జీవన ప్రమాణాలు
- సంక్షేమ పథకాలతో ఇంటింటా సంతోషం



గ్రామ సచివాలయం



రైతు భరోసా కేంద్రం



వెల్‌నెస్ కేంద్రం

సీతంపేట: గత టీడీపీ ప్రభుత్వం గిరిజన గ్రామాల అభివృద్ధిని గాలికొదిలేయగా.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధికి బాటలు వేసింది. మారుమూల గ్రామాలను మండల కేంద్రాలతో అనుసంధానం చేస్తూ రహదారులు నిర్మాణం చేపట్టడంతో పాటు గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించడంతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. నూతనంగా ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అర్హుల చెంతకే చేరుతున్నాయి. మండలంలోని మారుమూల గిరిజన పంచాయతీ అయిన దేవనాపురం అభివృద్ధి, సంక్షేమంలో ఆదర్శంగా నిలుస్తోంది. ఈ పంచాయతీ పరిధిలో చిన్నరామ, దేవనాపురం, డి.లక్కాయిగూడ, బంబడుగూడ, చాపరాయిగూడతో పాటు మరో 15 వరకు చిన్న చిన్నగూడలు ఉన్నాయి. సుమారు 1209 కుటుంబాలు, 5355 మంది జనాభా ఉన్నారు. దేవనాపురంలో రూ.43.60 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.23.94 లక్షలతో ఆర్‌బీకే, రూ.28.80 లక్షలతో వెల్‌నెస్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. దీంతో పాటు సీసీరోడ్లు, తాగునీటి కుళాయిలు, డ్రైనేజీలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగింది. సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ డీబీటీ విధానంలో రూ.11,31,76,930లు, నాన్ డీబీటీ విధానంలో రూ.2,24,28,661లు మొత్తంగా రూ.13,66,05,691లు లబ్ధి జరిగింది.



దీసరిగూడలో నిర్మించిన కాలువ

రూపురేఖలు మారాయి



దేవనాపురం గ్రామ సచివాలయం పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. ప్రజలకు అవసరమైన సేవలన్నీ గ్రామంలోనే అందుతున్నాయి. గతంలో కంటే ఇప్పుడు గ్రామాల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతీ కుటుంబానికి లబ్ధిచేకూరింది.
– ఎస్.మౌనిక, సర్పంచ్, దేవనాపురం

పథకాలు పకడ్బందీగా అమలు



ప్రతీ పథకం పకడ్బందీగా అమలు చేస్తున్నారు. గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. మౌలిక వసతులు కూడా కల్పిస్తున్నారు. – సవర చిన్నబూగన్న, రుక్మిణిగూడ, వార్డు సభ్యుడు

చేయూతతో ఆర్థిక భరోసా..



మహిళలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంది. చేయూత, సున్నావడ్డీ, ఆసరా వంటి పథకాలతో ఆర్థిక భరోసా కల్పించింది. ప్రభుత్వం ఇచ్చిన డబ్బులతో జీవనోపాధులు పొందాం. ఐదేళ్లలో అనేక పథకాలు అందుకున్నాం. – బి.గౌరమ్మ, దేవనాపురం

సచివాలయం పరిధిలో సంక్షేమ లబ్ధి వివరాలు

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	లబ్ధి (నగదు)
అమ్మఒడి	304	రూ.1,40,54,645
విద్యాదీవెన	177	రూ.28,87,060
వసతి దీవెన	75	రూ.11,49,920
వైఎస్సార్ రైతుభరోసా	612	రూ.2,99,30,050
ఉచిత పంటల బీమా	1	రూ.22,058
సున్నా వడ్డీ(పంట రుణాలు)	59	రూ.1,45,515
వైఎస్సార్ పింఛన్ కానుక	397	రూ.3,92,16,500
వైఎస్సార్ చేయూత	249	రూ.96.56,250
వైఎస్సార్ ఆసరా	405	రూ.87,90,073
సున్నా వడ్డీ(ఎస్‌హెచ్‌జీ)	426	రూ.2,18,584
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	174	రూ.37,23,797
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	123	రూ.6,84,700
హౌసింగ్	35	రూ.4,14,100
వైఎస్సార్ బీమా	8	రూ.13,30,000
వైఎస్సార్ వాహన మిత్ర	14	రూ.3,50,000
వైఎస్సార్ నేతన్న హస్తం	601	రూ.6,01,000
జగనన్న తోడు(వడ్డీ)	5	రూ.2,678
మొత్తం		రూ.11,31,76,930

హ్యాట్రిక్ విజయం మీదే..



వైఎస్సార్‌సీపీ నాయకులతో ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి హ్యాట్రిక్ విజయం సాధిస్తారని వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం కార్యదర్శి నల్లబిల్లి సుహాసిని ధీమా వ్యక్తం చేశారు. వండవలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే కళావతిని కలిసి అభినందించారు. ఎమ్మెల్యేతో కేక్ కట్ చేయించారు. మూడోసారి పాలకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా కళావతి పేరును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ విజయోత్సవాల నిర్వహణకు తామంతా సిద్ధంగా ఉన్నామన్నారు.

గ్రామాల్లో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



ఉల్లిభద్ర జంక్షన్‌లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

గరుగుబిల్లి: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసుశాఖ చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఎస్పీ ఆదేశాల మేరకు సమస్యాత్మక, అతిసమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు, కేంద్ర బలగాలు కవాతు నిర్వహిస్తున్నాయి. మండలంలోని ఉల్లిభద్ర జంక్షన్, ఖడ్గవలసలో జంక్షన్, కొంకడివరం పంచాయతీ సీతారాంపురం గ్రామంలో పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు, స్థానిక ఎస్సై అమ్మన్నరావు ఆధ్వర్యంలో శుక్రవారం పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ప్రజలు ఎలాంటి ఒత్తిడికి, ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని, తమకు నచ్చిన అభ్యర్థులను ఎన్నుకోవాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతుల పరిశీలన

గరుగుబిల్లి: పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అసౌకర్యం కలగకుండా వసతులు కల్పించాలని డీఎస్పీ జీవీ కృష్ణారావు సూచించారు. మండలంలోని ఉల్లిభద్ర పోలింగ్ కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. కేంద్రంలో తాగునీరు, విద్యుత్, వృద్ధులకు ర్యాంపులు, తదితర సౌకర్యాలపై ఆరాతీశారు. ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాలని, కోడ్ ఉల్లంఘించేవారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ప్రశాంత ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు, సిబ్బంది సహకరించాలని కోరారు. ఎన్నికల ప్రచారానికి ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు.

నాడు అధ్వానం.. నేడు అద్భుతం



రూ.1.50 కోట్లతో నిర్మించిన బీటీ రహదారి



గుమ్మ నుంచి ఏగులవాడ గ్రామ రహదారి దుస్థితి

కురుపాం: టీడీపీ పాలనలో అభివృద్ధికి నోచుకోని గిరిజన గ్రామాలు నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని మౌలిక వసతులతో అభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి చొరవతో ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించింది. దీంతో గిరిజన గ్రామాల్లో బీటీరోడ్లు, సీసీకాలువలు, తాగునీటి కుళాయిలు, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు నిర్మించారు. ఇందులో భాగంగా మండలంలోని గుమ్మ గ్రామం నుంచి ఏగులవాడ గ్రామం వరకు సుమారు రూ.1.50 కోట్లతో 3 కిలోమీటర్ల మేర బీటీరహదారి నిర్మాణం చేపట్టడంతో ఈ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నం నెరవేరింది. దశాబ్దాలుగా సరైన రోడ్డు లేక రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు నేడు రహదారి సౌకర్యం కల్పించడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొండ రూరల్: మండలంలోని నవగాం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ టీజీకే మూర్తి శుక్రవారం తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ నిర్వహణ పనుల్లో భాగంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు పనుకువలస, దుగ్గి, అట్టలి, తుమరాడ, టీకే.రాజపురం, టీడీ.పారాపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

శిలువయాత్ర



శిలువపై యాత్రలో పాల్గొన్న క్రీస్తు విశ్వాసకులు

భామిని: మండల కేంద్రంలో క్రీస్తు విశ్వాసకులు శుక్రవారం క్రీస్తుశిలువ యాత్ర నిర్వహించారు. బత్తిలి చర్చ్ ఫాదర్ థామస్‌రెడ్డి ఆధ్వర్యంలో విశ్వాసకులు కీర్తనలు ఆలపిస్తూ యాత్రలో పాల్గొన్నారు. శిలువపై ఏసుప్రభువు పడిన యాతనను దీక్షాపరులు చూపరులను ఆకట్టుకునేలా ప్రదర్శించారు. సర్పంచ్ లోపింటి రాజేశ్వరి పర్యవేక్షణలో విశ్వాసకులు ప్రార్థనలు చేశారు.

క్షేత్రస్థాయిలో ఫీవర్ సర్వే..

పార్వతీపురం టౌన్: క్షేత్రస్థాయిలో ఫీవర్ సర్వే పక్కాగా చేపట్టి జ్వరపీడితులను గుర్తించాలని జోనల్ మలేరియా నివారణాధికారి ఎం. శాంతిప్రభ అన్నారు. ఈ మేరకు జిల్లా మలేరియా నివారణ అధికారి టి. జగన్ మోహనరావు ఆధ్వర్యంలో ఆరోగ్య పర్యవేక్షకులు, ఆరోగ్య సహాయకులకు శుక్రవారం స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లో రీ ఓరియంటేషన్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జ్వరపీడితులను గుర్తించి వైద్యసేవలు అందించాలన్నారు. రాబోయే సీజన్‌లో జ్వరాలను అదుపులోఉంచేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని సూచించారు. దోమలు వృద్ధి చెందే స్థావరాలను గుర్తించి, నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. డాక్టర్ జగన్ మోహనరావు మాట్లాడుతూ.. రీ ఓరియంటేషన్ ట్రెనింగ్ రెండు రోజులు నిర్వహిస్తామన్నారు. కీటక జనిత వ్యాధుల నియంత్రణపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఏఎంఓ సూర్యనారాయణ, జిల్లా వీబీడీ కన్సల్టెంట్ రామచంద్రరావు, మైక్రో బయాలజిస్ట్ డాక్టర్ అప్పారావు, ఈఓ నాగేంద్ర పాల్గొన్నారు.

బయోటెక్నాలజీతో విప్లవాత్మక మార్పులు



మాట్లాడుతున్న లక్ష్మణనాయుడు

పాలకొండ రూరల్: మొక్కలతో మానవ మనుగడ ముడిపడి ఉందని, జీవసాంకేతిక శాస్త్రంలో వస్తున్న పురోగతి మానవాళి అభివృద్ధికి ఎంతగానో దోహదం చేస్తుందని విశాఖపట్నం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల బయోటెక్నాలజీ అధ్యాపకుడు డాక్టర్ దూబ లక్ష్మణనాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బోటనీ విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ ఎం.శ్యాంబాబు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. జన్యు పరివర్తిత మొక్కలు, వాటి ప్రయోజనాలను వివరించారు. ప్లాంట్ బయోటెక్నాలజీలో వస్తున్న నూతన పోకడలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జయమణి, అధ్యాపకులు జనార్దనరావు, ఉపేంద్రరావు, జగన్మోహనరావు, శంకరబాబు, తదితరులున్నారు.

ఎన్నికల కోడ్ అమలులో నిర్లక్ష్యం వద్దు



ఎం.సింగుపురంలో పర్యటిస్తున్న ఎన్నికల నోడల్ అధికారి

పాలకొండ రూరల్: క్షేత్రస్థాయిలో ఎన్నికల ప్రవర్తన నియమావళి కచ్చితంగా అమలు చేయలి ఎన్నికల నోడల్ అధికారి ఏఎస్.రామకృష్ణ అన్నారు. మండలంలోని ఎం.సింగుపురం, నవగాం, పొట్లి తదితర గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఎన్నికల కోడ్ అమలు తీరును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఓటర్లను ప్రభావితం చేసేలా రాజకీయ పార్టీలకు సంబంధించిన పోస్టర్లు, బ్యానర్లు, గోడలపై రాతలు లేకుండా చూడాలన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా క్షేత్రస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది ప్రజలను చైతన్యపర్చాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో నిర్లక్ష్యంగా ఉన్న సిబ్బందిపై చర్యలు తప్పవని స్పష్టం చేసారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఆరోగ్య సంరక్షణకు తొలి ప్రాధాన్యం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

పాలకొండ రూరల్: ప్రస్తుత సీజన్‌లో ప్రజలు ఆరోగ్య సంరక్షణకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని ఎం.సింగుపురం పీహెచ్‌సీ వైద్యాధికారి శివశంకర్ అన్నారు. మండలంలోని ఎల్.ఎల్.పురంలో శుక్రవారం ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 225 మందికి వైద్యసేవలు అందించారు. వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ శిబిరాన్ని సందర్శించి అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

జలమే జీవనాధారం..



ర్యాలీలో పాల్గొన్న ఈఓపీఆర్డీ గోపాలరావు

గరుగుబిల్లి: జీవకోటి మనుగడకు నీరు ఎంతో అవసరమని, నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు, వెలుగు ఏపీఎం పి.అప్పలనాయుడు అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ నీటి విలువ తెలుసుకోవాలని, భావితరాలను దృష్టిలో పెట్టుకొని నీటిని పొదుపుగా వాడటంతో పాటు జల సంరక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మహిళా సంఘ సభ్యులు, గ్రామైఖ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ పునఃప్రతిష్ఠ



పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రుత్వికులు

గరుగుబిల్లి: మండలంలో రావుపల్లి గ్రామంలోని పెద్దవీధిలో సీతారామ మందిర పునఃప్రతిష్ఠను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం దేవతా మూర్తుల విగ్రహాలతో గ్రామప్రదక్షిణ, విఘ్నేశ్వర పూజ, యాగశాల ప్రవేశం, ధ్వజ పతాక ఆవిష్కరణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 24న ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించనున్నారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి



భామిని: సిబ్బందికి సూచనలు చేస్తున్న ఏఆర్ఓ శ్రీనివాసరావు, మాస్టర్ ట్రైనీ శ్రీనివాస్



వీరఘట్టం: ఎన్నికల విధులపై శిక్షణ ఇస్తున్న తహసీల్దార్ జయప్రకాష్

పాలకొండ రూరల్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై ప్రిసైడింగ్ అధికారులు(పీవో)లకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ వరహాలు పర్యవేక్షణలో ఈవీఎంల వినియోగం, నిర్వహణ, వీవీ ప్యాడ్స్, మార్కుడు కాపీ వాడకంపై శిక్షణ కొనసాగింది. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. శనివారం ఏపీఓలకు ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇవ్వనున్నట్లు నోడల్ అధికారి రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని డిప్యూటీ తహసీల్దార్లు, ఈవోపీఆర్డీలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

– వీరఘట్టం: ఎన్నికల విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జయప్రకాష్ సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం పీఓలు, ఏపీఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈవీఎంల వినియోగం, ఏదైనా టెక్నికల్ సమస్యవస్తే తీసుకోవాల్సిన చర్యలు, పోలింగ్ సంబంధిత అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓలు గౌరినాయుడు, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

భామిని: మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల విధుల్లో పాల్గొనే పీఓలు, ఏపీఓలకు శుక్రవారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్, ఏఆర్ఓ పి.శ్రీనివాసరావు, మాస్టర్ ట్రైనీ కె.శ్రీనివాస్, ఎంఈఓ వి.భాస్కరరావు ఆధ్వర్యంలో 60 మంది పీఓ, ఏపీలకు పోలింగ్ విధులు, నిబంధనలపై అవగాహన కల్పించారు.

స్ట్రాంగ్ రూంల పరిశీలన



సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా అగ్నిమాపక అధికారి

పాలకొండ రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పాలకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్ రూమ్‌లను, అక్కడి పరిసరాలను జిల్లా అగ్నిమాపక అధికారి కె.శ్రీనుబాబు శుక్రవారం రాత్రి పరిశీలించారు. విద్యుత్ సరఫరా, సీసీ కెమెరాల ఏర్పాటు, ఇతర భద్రతా పరమైన చర్యలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్ట్రాంగ్ రూం పరిసరాల్లో వ్యర్థాలు, ఎండిన చెత్తపోగులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అగ్నిమాక అధికారి జామి సర్వేశ్వరావుతో పాటు ఎన్నికల నిర్వహణ అధికారులకు సూచించారు.

రక్తహీనత నివారణకు చర్యలు

గుమ్మలక్ష్మీపురం:

గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో రక్తహీనత నివారణకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తోందని, వాటిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ ఎం.ఎన్.రాణి అన్నారు. భద్రగిరి ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ సీహెచ్.సుశీలాదేవి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రాజెక్ట్ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రక్తహీనత నివారణే లక్ష్యంగా నిర్వహిస్తున్న ప్రిజం–10 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఇంటింటికీ వెళ్లి రక్తహీనతతో బాధపడుతున్న వారిని గుర్తించి మందులు, పౌష్టికాహారం అందించాలని సూచించారు.